క్లుప్తంగా

వేణుగోపాలునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

పెదపూడి: మండలంలోని వేండ్రలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం వైశాఖ బహుళ ఏకదశి సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు, తులసి పూజ, అమ్మవారికి కుంకుమ పూజ, హోమాలు నిర్వహించారు. అర్చకులు సుదర్శన కృష్ణమాచార్యులు, పండితులు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

పందలపాకలో పోలీసుల కవాతు



పందలపాకలో కవాతు చేస్తున్న పోలీసులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో ఎస్‌ఐ పి.బుజ్జిబాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ బుజ్జిబాబు మాట్లాడుతూ ఈ నెల నాలుగో తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కవాతుని ర్వహించామన్నారు. కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల ఫలితాల రోజున బాణసంచా కాల్చడం, ఊరేగింపులకు అనుమతి లేదన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలోని పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంతో రైతుల్లో హర్షం



రంగంపేటలో కురుస్తున్న వర్షం

రంగంపేట: వేసవి ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఆదివారం కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. నైరుతీ రుతుపవనాలు ప్రవేశించడంతో కురిసిన తొలకరి వర్షంతో పుడమి తల్లి పులకించింది. మే నెలలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వడగాల్పుల వేడిమికి తట్టుకోలేక ప్రజలు విలవిల్లాడిపోయారు. నైరుతీ రుతుపవనాల రాక రెండు రోజుల ముందుగానే వర్షాలు ప్రారంభం కావడంతో వాతావరణమంతా ఒక్కసారిగా చల్లబడింది. దీంతో నెర్రలు వారిన పంట చేలు వర్షంతో తడిసి ముద్దయ్యాయి. వాతావరణం చల్లబడడంతో రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

సీతానగరం: వంగలపూడి శివారున పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్సై టి.రామకృష్ణ ఆదివారం తెలిపారు. వంగలపూడికి చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,800 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేశామని, వారిని కోర్టులో హాజరుపర్చుతామని ఎస్సై తెలిపారు.

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని దర్శనానికి ఆదివారం భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

సీటీఆర్‌ఐ: భారత్ వికాస్ పరిషత్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు జిల్లా కోఆర్డినేటర్ పీవీఎస్ నారాయణ అన్నారు. ఆదివారం స్థానిక సూర్యహోటల్‌లో భారత్ వికాస్ పరిషత్ 2024–25 సంవత్సరం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం వర్క్‌షాప్ నిర్వహించారు. 60 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ పురుషోత్తమ శాస్త్రి, కోశాధికారి టి.సాయికృష్ణ, కొత్తపల్లి వీర్రాజు, కృష్ణరావు పాల్గొన్నారు.

శత శాతం.. శరాఘాతం..

- పన్నుల వసూళ్లకు ఎన్నికల ఎఫెక్ట్
- 2023–24 ఆర్థిక సంవత్సరంలో తగ్గిన వసూళ్ల శాతం



బిక్కవోలు: స్థానిక సంస్థలకు పన్నుల రూపంలో వచ్చే ఆదాయం ఎంతో కీలకం. ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రూపాల్లో నిధులు మంజూరు చేస్తున్నా స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఖజానాను నింపుకోవడం వల్ల గ్రామాభివృద్ధికి బాటలు పడతాయి. గత ఐదేళ్లుగా పంచాయతీ పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించేవారు. అయితే ఎన్నికల హడావుడి నేపథ్యంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆశించిన స్థాయిలో పన్నుల వసూళ్లు జరగలేదు.

రూ.కోట్లలో బకాయిలు

అనపర్తి మండలానికి సంబంధించి 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్నుల రూపేణా రూ.4,25,89,598 వసూలు చేయాల్సి ఉండగా రూ.3,26,61,446 వసూలు చేశారు. మరో రూ.99,28,152 బకాయి ఉండిపోయింది. బిక్కవోలు మండలంలో రూ.2,98,41,414 వసూలు చేయాల్సి ఉండగా రూ.2,52,40,066 వసూలైంది. రూ.46,01,348 వసూలు కావాల్సి ఉంది. రంగంపేట మండలానికి సంబంధించి రూ.1,43,18,533 మేర ఇంటి పన్ను వసూలు కావాల్సి ఉండగా కేవలం రూ.89,95,663 మాత్రమే వసూలు చేశారు. మరో రూ.53,22,870 మేర బకాయిలు ఉండిపోయాయి. పెదపూడి మండలం రూ.1,39,81,807 వసూళ్లు చేయాల్సిండగా రూ.1,22,57,240 వసూళ్ల చేశారు. మరో రూ.17,24,567 మేర వసూలు చేయాల్సి ఉంది. మొత్తంగా అనపర్తి నియోజకవర్గంలో రూ.10,07,31,352 మేర పన్నులు వసూలు చేయాల్సి ఉండగా రూ.7,91,54,415 వసూలు చేశారు. మరో రూ.2,15,76,937 మేర బకాయి ఉండిపోయింది.

అగ్రగామిగా పెదపూడి.. తీసికట్టుగా రంగంపేట..

అనపర్తి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎక్కడా నూరు శాతం పన్నుల వసూళ్లు జరగలేదు. పెదపూడి మండలంలో అత్యధికంగా 87.66 శాతం, బిక్కవోలు మండలంలో 84.58 శాతం, అనపర్తి మండలంలో 76.69 శాతం మేర పన్నులు వసూలు చేశారు. నియోజకవర్గంలోనే అత్యల్పంగా రంగంపేట మండలంలో కేవలం 62.83 శాతం మాత్రమే పన్ను రూపేణా వసూలైంది. అయితే నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో మాత్రం నూరు శాతం పన్నులు వసూలు చేసి ఆదర్శంగా నిలిచారు. అనపర్తి మండలంలోని కొప్పవరం, పెడపర్తి, పాలమూరు, పులుగుర్త, రామవరం గ్రామాల్లో, బిక్కవోలు మండలంలోని ఇలపల్లి, కొమరిపాలెం, కొంకుదురు గ్రామాల్లో నూరు శాతం పూర్తి చేశారు. రంగంపేట మండలం నుంచి ఏ గ్రామం నూరు శాతం పన్నుల వసూలు చేయలేదు. పెదపూడి మండలంలోనైతే సంపర, పెదపూడి, జి.మామిడాడ మినహా మిగిలిన అన్ని గ్రామాల్లో నూరు శాతం వసూళ్లు పూర్తి చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా పన్నుల వసూళ్లు మెరుగుపడ్డాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఆశించిన స్థాయిలో పన్నులు వసూలు జరిగినా 2023–24 ఆర్థిక సంవత్సరంతో పాటు గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో పేరుకుపోయిన మొండి బకాయిల వసూళ్లలో యంత్రాంగం విఫలమైందనే చెప్పాలి. అధికారుల నిర్లిప్తత కారణంగా ప్రధానంగా రంగంపేట మండలం అత్యంత తీసికట్టుగా కనిపిస్తుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే పంచాయతీలకు మేలు జరుగుతుంది.

బకాయిల వసూళ్లకు ప్రయత్నిస్తున్నాం



2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బకాయిల వసూళ్లకు ప్రయత్నిస్తున్నాం. ఇంటి పన్నుల చెల్లించాలంటూ ప్రజలకు అవగాహన కూడా కల్పించాం. యజమానులకు నోటీసులు జారీ చేశాం. ప్రజలంతా సహకరించి పన్నులు చెల్లిస్తే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుంది.
– బి.భవానీ, ఈఓపీఆర్డీ, బిక్కవోలు

ఆలయ భూముల కౌలు హక్కుకు నేడు వేలం

సీతానగరం: మండలంలోని పలు ఆలయాలకు సంబంధించిన భూములపై కౌలు హక్కుకు సోమవారం ఉదయం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు దేవదాయ, ధర్మదాయ శాఖ ఈఓ సోమాల శివ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రఘుదేవపురం, సీతానగరం, మిర్తిపాడులలోని ఆలయాల భూములు భూసేద్యపు కౌలు హక్కుకు 2024–25 ఏడాది నుంచి 2026–27 ఏడాది వరకూ సుమారు మూడేళ్లకు ఆయా ఆలయాల వద్ద వేలం పాటలు నిర్వహిస్తామన్నారు. రఘుదేవపురంలోని రామలింగేశ్వర స్వామి వారి దేవస్థాన భూమి సర్వే నబరు 530లో 6.77 ఎకరాలకు ధరావత్తు రూ.30 వేలు, సర్వే నంబరు 304లో 1.01 ఎకరాలకు రూ రూ.10 వేలు, సర్వే నంబరు 82/1లో 0.71 సెంట్లకు రూ.5 వేలు ధరావత్తుగా చెల్లించి ఉదయం 10 గంటలకు వేలంలో పాల్గొవచ్చన్నారు. అదే విధంగా సీతానగరంలోని సీతారామస్వామి దేవస్థానం ఆలయ భూములు సర్వే నంబరు 682/1లో 2.85 ఎకరాలకు ధరావత్తు రూ.15 వేలు, సర్వే నంబరు 682/3 లో 7.57 ఎకరాలకు రూ.35 వేలు చెల్లించి మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించే బహిరంగ వేలంపాటలో పాల్గొవచ్చన్నారు. అలాగే మిర్తిపాడులోని వేణుగోపాలస్వామి వారి దేవస్థానం భూములు సర్వే నంబర్ 48లో 6.86 ఎకరాలకు ధరావత్తు రూ.30 వేలు, సర్వే నంబర్ 70లో 3.90 ఎకరాలకు ధరావత్తు రూ.15 వేలు చెల్లించి బహిరంగ వేలంపాటలో పాల్గొవచ్చన్నారు. వేలంపాటలో కైవసం చేసుకున్న కౌలు రైతులు మొదటి ఏడాది కౌలు సొమ్మును చెల్లించి భూమిలో పంట వేసుకోవచ్చని దేవదాయ, ధర్మదాయశాఖ ఈఓ శివ వివరించారు.

ఆయన మరణం పార్టీకి తీరని లోటు



పాపారావు చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ పీఏసీఎస్ చైర్మన్, గ్రామ ఆర్బీకే చైర్మన్ నల్లమోలు పాపారావు మరణం పార్టీకి తీరని లోటని రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం కూనవరంలో పాపారావు పెదకార్యంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాలంకరణ చేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు సత్యనారాయణ, సూర్యచంద్రరావు, నరేష్‌లను పరామర్శించి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. విలేకరులతో మట్లాడుతూ గత నెల 23 న గుండెపోటుతో మరణించిన నల్లమోలు పాపారావు మరణం పార్టీకి తీరనిలోటని, పార్టీ విజయానికి ఎనలేని కృషి చేశారని, ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుంకర గంగాలక్ష్మి, ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, ఉపసర్పంచ్ మండపాక గణేష్, పార్టీ నాయకులు నల్లమోలు నూకరాజు, సుంకర నరసింహం, అయిల పాపారావు, అయిల రమేష్, కొండాటి సతీష్, జక్కంపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్ల పరిశీలన

- ఉద్వేగాలకు లోను కావొద్దు
- శాంతి భద్రతలకు భంగం కలిగించవద్దు
- ప్రజలకు, నాయకులకు విజ్ఞప్తి



ఓట్ల లెక్కింపు వద్ద బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ప్రత్యేక అధికారి రవిప్రకాష్

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఆదికవి నన్నయ యూనివర్సిటీలో మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపు, భద్రతా ఏర్పాట్లను ఏలూరు రేంజ్ ప్రత్యేక అధికారి, కమిషనర్, స్పెషల్ ఎన్ఫోర్ బ్యూరో ఎం. రవిప్రకాష్ ఆదివారం పరిశీలించారు. యూనివర్సిటీ ప్రాంగణంలోని స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు జరిగే ప్రాంతాలలో ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించి, అధికారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి రవిప్రకాష్ మాట్లాడుతూ ప్రజలంతా సామరస్యంగా, ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరిపేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎటువంటి ఉద్వేగాలకు లోనుకావొద్దని, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించవొద్దన్నారు. సెక్షన్ 144 సీఆర్‌పీసీ, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ప్రజలంతా దానికనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఉద్వేగపూర్వక ప్రసంగాలు చేయవద్దని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ కేడర్‌ని అదుపు తప్పకుండా నియంత్రించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గెలుపు, ఓటములకు అతీతంగా సమన్వయం పాటించాలని హితవు పలికారు.

152 సీసీ కెమెరాలతో నిఘా

ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా తీసుకున్న చర్యలను జిల్లా ఎస్పీ పి.జగదీష్ ప్రత్యేక అధికారికి వివరించారు. ఇప్పటికే ట్రైల్ రన్ నిర్వహించామని, మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. లెక్కింపు ఆవరణలో 152 సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంచామన్నారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా కౌంటింగ్ సిబ్బదికి, ఏజెంట్స్‌కి తగు సూచనలు ఇచ్చేలా ఏర్పాట్లు ఉన్నాయన్నారు. అత్యవసర ఏర్పాట్లలో భాగంగా ప్రజలు గుమిగూడితే చెదరకొట్టడానికి వజ్ర వాహనం, టియర్ గ్యాస్ ఎక్విప్మెంట్, అంబులెన్స్, ఫైర్ ఇంజిన్లను ఉంచుతామన్నారు. లెక్కింపు అనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా 129 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి, 39 పోలీస్ పిట్స్, 59 మొబైల్ పార్టీస్, 13 క్యూఆర్టీ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. పోటీ చేసిన అభ్యర్థుల గృహాలు, పార్టీ కార్యాలయాల వద్ద పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు వారికి తగిన సూచనలిస్తూ, బందోబస్తును పర్యవేక్షిస్తున్నామని ఎస్పీ వివరించారు.

ఏజెంట్లు సంయమనం పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ఈ నెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో కౌంటింగ్‌కు హాజరయ్యే ఏజెంట్లు సంయమనం పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా కౌటింగ్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కౌంటింగ్ సమయంలో ప్రతిపక్ష పార్టీ నాయకులు, కౌంటింగ్ ఏజెంట్లు రెచ్చగొట్టేలా కవ్వింపు చర్యలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. అయినా సరే వైఎస్సార్ సీపీ తరఫున హాజరవుతున్న కౌంటింగ్ ఏజెంట్లు అందరూ ఎలక్షన్ కమిషన్ నిబంధనలను అతిక్రమించొద్దని సూచించారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని, అయితే సోషల్ మీడియాలో రెచ్చగొట్టే మెసేజ్‌లు పెట్టొద్దని కోరారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనలు అతిక్రమించి ఇబ్బందులకు గురి కావద్దని, కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసుకుని ఎన్నికల సంఘం సూచనలకు అనుగుణంగా విజయోత్సవాలు నిర్వహించుకుందామన్నారు. సమావేశంలో జెడ్పీ మాజీ ప్రతిపక్ష నాయకుడు సత్తి రామారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, పలువురు పార్టీ నాయకులు, కౌంటింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

అన్ని వర్గాల వారికి సేవలు



సమావేశంలో పాల్గొన్న సంస్థ సభ్యులు

సీటీఆర్‌ఐ: వాసవీ ఇంటర్నేషనల్ సౌజన్యంతో మిస్టర్ అండ్ మిసెస్ రాణి ప్రవీణ్ కపుల్స్ ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ వీ 215 ఏ డిస్టిక్ గవర్నర్ కాళ్లకూరి కె.వి.పి.ఆర్.ఎస్ ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు. ఆదివారం స్థానిక ఎస్‌వీ పంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాసవీ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎరుకుల రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలోనే పుట్టిన వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ సంస్థ 14 దేశాలలో సేవలందిస్తున్నారన్నారు. మన దేశంలో మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ తదితర రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో సంస్థ సేవలు అందిస్తుందని తెలిపారు. ఇంటికి పరిమితమైన వైశ్య సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలను ఒక చోటకి చేర్చి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వారి మధ్య పోటీ నిర్వహించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిస్టిక్ గవర్నర్ వి 215 కాళ్లకూరి కె.వి.పి.ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తాను ఈ పదవి చేపట్టినప్పుడు నుంచి ఎన్నో సేవా కార్యక్రమం నిర్వహించమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బోడా సాయి సూర్యప్రకాష్, ప్రాజెక్ట్ చైర్పర్సన్ గ్రంధి సుజాత, వి.సునంద, సీహెచ్ ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రీమియర్ లీగ్ విజేత రాజా వారియర్స్

ప్రకాశంనగర్: మున్సిపల్ కాలనీ ప్రీమియర్ లీగ్ సీజన్ 10 క్రికెట్ టోర్నమెంట్‌లో రాజా వారియర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం స్థానిక మున్సిపల్ గ్రౌండ్‌లో 40 రోజులపాటు జరుగుతున్న లీగ్ మ్యాచ్‌ల్లో రాజా వారియర్స్, వాంబే సూపర్ కింగ్స్ రెండు జట్లు ఫైనల్‌కి చేరుకున్నాయి. విజేతగా నిలిచిన రాజా వారియర్స్‌కు వైఎస్సార్ సీపీ నాయకులు టీకే విశ్వేశ్వరరెడ్డి ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాలతో శరీరక ధృడత్వంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 42 వార్డు ఇన్‌చార్జి నామాన వాసు, బూసి వజ్రనాథ్, రఫీ, ఉమా, కోట, ఎండీ వజీర్, పురుషోత్తం, నాగార్జున, రషీద్ పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాజమహేంద్రవరం సిటీ: ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌నకు విశేష స్పందన లభించిందని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు లక్ష్మి నారాయణ జవ్వార్, గౌరవ కార్యదర్శి మద్దుల మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం మెయిన్ రోడ్డులోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సుమారు 300 మందికి ఉచిత కంటి, దంత, గుండె, జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసినట్టు తెలిపారు. వంద మందికి కళ్లజోళ్లు అవసరమయ్యాయన్నారు. వారిని ఆదివారం అందజేస్తామన్నారు. 30 ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ పరిధిలోని జట్టు కూలీలు, షాపుల్లో పని చేసే సిబ్బంది పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు అశోక్ కుమా ర్ జైన్, నందెపు శ్రీనివాస్, ట్రెజరర్ బలభద్ర వెంకట్రాజు, ట్రస్టుబోర్డు కార్యదర్శి శ్రీకనకాల రాజా, కార్యవర్గ సభ్యులు యక్కల నాగేశ్వరరావు, వలవల దుర్గా ప్రసాద్(చిన్ని), వివిధ సంఘాల ప్రతినిధులు, జట్లు లేబర్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నాదస్వర విద్వాంసులు మంగమూరి కన్నుమూత



మంగమూరి భాస్కరరావు (ఫైల్)

కడియం: ప్రముఖ నాదస్వర విద్వాంసులు, జేగురుపాడు సంగీత వాయిద్య మండలి వ్యవస్థాపకులు మంగమూరి భాస్కర రావు(85) ఆదివారం కన్నుమూశారు. జేగురుపాడు మ్యూజికల్ బ్యాండ్ టీం భాస్కరరావుగా ఉభయగోదావరి జిల్లాలతో పాటు విశాఖపట్నం తదితర ప్రాంతాల సంగీత ప్రియులకు ఆయన సుపరిచితులు. వృద్ధాప్యంతో ఇంటి వద్దే తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారులు కూడా సంగీత వాయిద్య కళాకారులుగా రాణిస్తున్నారు. ప్రముఖ కవి, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు గండి స్వామి ప్రసాద్ భాస్కరరావుకు అల్లుడు. కాగా నాదస్వరం, సన్నాయి, ట్రంపెట్, ఫ్లూట్, డ్రమ్స్ తదితర సంగీత వాయిద్యాల్లో ఆయన నిష్ణాతులు. ప్రఖ్యాత సంగీత విద్వాంసులు వెంకట్రావు శిష్యరికంలో ఆయన సంగీత మెళకువలు నేర్చుకున్నారు. భాస్కరరావు మృతిపై విజయవాడ రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ గండి నాగేంద్రప్రసాద్, బ్యాంకింగ్ రంగ నిపుణులు ఎం.ప్రసాదరావు, విజయవాడ డివిజన్ రైల్వే స్కౌట్ మాస్టర్ గండి రాజేంద్ర ప్రసాద్, జేగురుపాడు గ్రామ సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్, మాజీ ఎంపీటీసీ పాలపర్తి ప్రకాష్ కుమార్, యాదల మహేంద్రవర్మ తదితరులు సంతాపం తెలిపారు.